క్లుప్తంగా

పోలీస్ స్టేషన్ ఏర్పాటు కోరుతూ వినతి



మంత్రి వనితకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్ / జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కొనసాగుతోన్న మండలంలోని 17 పంచాయతీలకు రూరల్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ హోం మంత్రి తానేటి వనితకు నాయకులు వినతి ప్రతం అందజేశారు. ఎ.పోలవరం మాజీ సర్పంచ్ బుద్దాల సత్యనారాయణ, నిమ్మలగూడెంకు చెందిన జిల్లా కళాకారులు సంఘం మాజీ అధ్యక్షుడు బల్లే అప్పారావు కొవ్వూరులో మంత్రిని కలిశారు. టౌన్ స్టేషన్ పరిధిలో కొనసాగడంతో సమస్యలు పరిష్కారం కావడంలేదని వివరించారు. స్టేషన్ ఏర్పాటుకు కృషి చేస్తానని మంత్రి హామి ఇచ్చారని నాయకులు తెలిపారు.

ఇంటర్న్‌షిప్‌పై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

కామవరపుకోట: స్థానిక ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఆరు నెలల ఇంటర్న్‌షిప్‌పై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.రవీంద్రబాబు మాట్లాడుతూ ప్రభుత్వ ఉన్నత విద్యాశాఖ ఆదేశాల మేరకు డిగ్రీ 5వ సెమిస్టర్ పూర్తి చేసిన విద్యార్థులు ఇంటర్న్‌షిప్ శిక్షణ పొందాల్సి ఉంటుందని, ఈ మేరకు ఇండస్ట్రీస్, కార్యాలయాలకు పంపించేందుకు తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. ఈ శిక్షణ ఉద్యోగం, స్వయం ఉపాధి అవకాశాలకు దోహదపడుతుందని పేర్కొన్నారు. కళాశాల అధ్యాపకులు ఎం.మల్లేశ్వరరావు, వి.శ్రీనివాస్, ధారావతు మల్లేష్, ఎ.హర్షవర్ధిని, బి.రాజు పాల్గొన్నారు.

ఆంధ్రా ఫిష్ భవనం ఏర్పాటుకు ఆటంకాలు



సర్పంచ్ విజయ కుమారికి వినతి పత్రం అందిస్తున్న మహిళలు

కొయ్యలగూడెం: స్థానిక సంత మార్కెట్ ప్రాంగణంలో నిర్మిస్తోన్న ఆంధ్రా ఫిష్ భవన ఏర్పాటుకు గల అవరోధాలను తొలగించాలని మత్స్యకార మహిళలు సర్పంచ్ ముప్పిడి విజయ కుమారికి వినతిపత్రం అందజేశారు. మత్స్యకార సంఘం ద్వారా ఆంధ్రా ఫిష్ దుకాణాల సముదాయాన్ని బ్యాంకు ఇచ్చే లోను, పంచాయతీ ద్వారా సుమారు ఏడున్నర లక్షల రూపాయలతో నిర్మిస్తున్నట్టు చెప్పారు. బ్యాంకు లోను నిలిచిపోయిందని తెలిపారు. సమస్యను ఎమ్మెల్యే తెల్లం బాలరాజు దృష్టికి తీసుకెళ్లి భవన నిర్మాణానికి సహకరిస్తానని సర్పంచ్ విజయ కుమారి హామీ ఇచ్చారు. జానా సీత, పాండ్రంకి పార్వతి, పిన్నింటి అచ్చాలమ్మ, జాన వెంకటేశ్వరరావు, పాండ్రింకి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు పగడాలతో పూజ



ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: స్థానిక మున్సిపల్ కార్యాలయ సమీపంలో కొలువైన ముత్యాలమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్మాణ కర్త బవిరిశెట్టి మురళీకృష్ణ, పద్మకుమారి దంపతుల ఆధ్వర్యంలో అమ్మవారికి పగడాలతో పూజ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం



పైపు వేయిస్తున్న సర్పంచ్ అనూష

కామవరపుకోట: స్థానిక కొత్తూరులోని గంగానమ్మ గుడి సెంటర్ సమీపంలో వేసవి వచ్చిందంటే మంచినీటి సమస్య ఏర్పడుతుంది. ఈ సమస్యను గ్రామస్తులు సర్పంచ్ కరిపోతు అనూష భాగ్యరాజ్ దృష్టికి తీసుకెళ్లగా శుక్రవారం కొత్త పైపులైన్లు ఏర్పాటు చేయించారు. నీటి సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు సర్పంచ్ అనుషను అభినందించారు.

రాష్ట్ర ప్రగతి, పేదరిక నిర్మూలనే ధ్యేయం

- ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా
- శివపురం పంచాయతీలో 'గడపగడపకు మన ప్రభుత్వం'



శివపురంలో లబ్ధిదారుడికి పథకాల బ్రోచర్ అందిస్తున్న మ్మెల్యే ఎలీజా



జక్కంపూడి గణేష్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

చింతలపూడి: రాష్ట్ర ప్రగతి, పేదరిక నిర్మూలనే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. శివపురం గ్రామంలో ఆయన శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. గ్రామస్తులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మాంచాలని, ఇళ్లులేని వారికి స్థలాలు కేటాయించాలని పలువురు కోరడంతో వీటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే ఎలీజా హామీ ఇచ్చారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజలను కలుసుకునే అవకాశం కల్పించిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోన్న కార్యక్రమానికి అధికారులందరూ హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నరుకుళ్ల హరిణి, సొసైటీ డైరెక్టర్ జబ్బూరి దుర్గారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్ రవీంద్ర, కొప్పుల నాగేశ్వరరావు, సొసైటీ చైర్మన్లు త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, ఎ.సుబ్బారావు, చుండూరి నాగేశ్వరరావు, యడ్ల మోహన్ రావు, ఎన్.గోపాలకృష్ణ, గురవయ్య, కలపాల అప్పారావు, ఎన్.దుర్గారావు, ఎం.దిలీప్, ఎస్.కాంతారావు, ప్రకాష్, తుల్లిమిల్లి చిన్న కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే యువత భవిష్యత్తు

చింతలపూడి: యువజన విభాగం ఐదు జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ శుక్రవారం ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గణేష్‌ను ఎమ్మెల్యే ఎలీజా, వైఎస్సార్‌సీపీ నాయకులు శాలువాతో ఘనంగా సత్కరించారు. సీఎం జగన్‌తోనే రాష్ట్రంలో యువత భవిష్యత్తు ముడిపడి ఉందని ఎలీజా అన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిగా గెలిపించుకు తీరుతామని గణేష్ చెప్పారు. కార్యక్రమంలో జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పడమట గిరిబాబు, పార్టీ పట్టణ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు, మండల సచివాలయాల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, చింతలపూడి నగర పంచాయతీ సచివాలయాల కన్వీనర్ నిమ్మగడ్డ దుర్గారావు, గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు మిరియాల దిలీప్, నరుకుళ్ల రవీంద్ర, ప్రకాష్, జైపాల్ తదితరులు ఉన్నారు.

నెరవేరుతున్న పేదల సొంతింటి కల



లక్కవరంలో ఇంటి పట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

జంగారెడ్డిగూడెం రూరల్: ప్రస్తుత ప్రభుత్వంలో సొంతింటి కల నెరవేరడంతో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా అన్నారు. జంగారెడ్డిగూడెం మండలం టెక్కినవారిగూడెంలో 64 మందికి, లక్కవరంలో 33 మందికి ఎమ్మెల్యే ఎలీజా చేతుల మీదుగా ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన అందిస్తున్నారన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించడంతోపాటు విద్య, వైద్య, వ్యవసాయ రంగాలు, అన్నివర్గాల ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల ద్వారా టీడీపీకి చెందిన వారికే పథకాలను అందించేవారని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, ఎంపీపీ కొదమ జ్యోతి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, గురజాల ధర్మావతి, గెల్లా వెంకట రమణ, తహసీల్దార్ స్లీవజోజి, సచివాలయాల మండల కన్వీనర్ గురజాల పార్థశారధి, పార్టీ నాయకులు నిమ్మ గురునాధరెడ్డి, నిమ్మ రామకృష్ణ, బడి దుర్గారావు, వందనపు సూర్యప్రకాష్‌రావు, చిల్ల దుర్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు అండగా నిలుద్దాం



తోచలకరాయుడుపాలెంలో మహిళతో మాట్లాడుతున్న నాయకులు



కొత్తకాలనీలో స్టిక్కర్ అతికించిన పార్టీ మండల అధ్యక్షుడు మోహనరావు



ధర్మారావుపేటలో ప్రచారం చేస్తున్న నాయకులు



రాజవరంలో ప్రచారం చేస్తున్న నాయకులు

లింగపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన రెడ్డి అండగా నిలబడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని లింగపాలెం మండల సచివాలయ ఇన్‌చార్జి అన్నపనేని శాంతారావు అన్నారు. గురువారం చలకరాయుడుపాలెంలో ఎస్సీ ఏరియాలో జగనన్నే మా భవిష్యత్, మానమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని శాంతరావు, వైఎస్సార్‌సీపీ మండల ముఖ్యనేత ముసునూరి వెంకటేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మందలపు సాయిబాబు, వైస్ ఎంపీపీ మట్టా సురేష్ ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. తోచలకరాయుడుపాలెం సచివాలయ పరిధిలోని కొత్తకాలనీలో గ్రామ సర్పంచ్ పింగుల శోభారాణి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు కొఠారి మోహనరావు, ఉపసర్పంచ్ బేతిన మధు పథకాల అమలుపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో గృహ యజమానుల అనుమతితో ఇళ్లకు సీఎం జగన్ స్టిక్కర్లను అతికించారు. గ్రామ కన్వీనర్లు కొండేటి బాబురావు, వెంపాటి సోమేశ్వరరావు, నాయకులు లక్కపాం చైతన్యం, పింగుల వెంకటేశు, పింగుల హృదయరాజు, తక్కిలపాటి పుల్లారావు, రామలింగం, ఏడుకొండలు, మోసుదాస్ తదితరులు పాల్గొన్నారు.

మండుటెండలోనూ విస్తృత ప్రచారం

కొయ్యలగూడెం: మండుటెండను సైతం లెక్కచేయకుండా సరిపల్లి పంచాయతీ ధర్మారావు పేట గ్రామంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పనితీరు, ప్రజా సమస్యలపైనా ఆరా తీశారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. ఎంపీటీసీ సభ్యుడు బండి సీతారత్నం, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి దూలపల్లి కాంతారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మదిన కాంతారావు, అద్దేపల్లి రాజా, ఎం.శ్రీను, తుమ్మలపల్లి హరీష్, ముప్పిడి యేసురత్నం, దూలపల్లి సత్యనారాయణ, మంచాల బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను మళ్లీ గెలిపిద్దాం

బుట్టాయగూడెం (జీలుగుమిల్లి): రాబోయే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని సొసైటీ అధ్యక్షుడు బోదా శ్రీనివాసరెడ్డి అన్నారు. జీలుగుమిల్లి మండలం పి.రాజవరంలో ఆయన మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సీఎం జగన్ చేసిన మంచిని వివరించారు. ప్రతి ఇంటికీ మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కులాలకు, మతాలకు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలను నేరుగా వారి ఇంటికే చేరే విధంగా కృషి చేస్తున్నారని శ్రీనివాసరెడ్డి చెప్పారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే బాలరాజు



ముస్లిం పెద్దలతో కలిసి ప్రార్థన చేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం: రంజాన్ సందర్భంగా స్థానిక మసీదులో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పాల్గొన్నారు. ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థన చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీరావు, టి.నర్సాపురం జెడ్పీటీసీ సభ్యుడు సామంతపూడి సూరిబాబు, సొసైటీ అధ్యక్షుడు ఆరేటి సత్యనారాయణ, వైఎస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, నాయకులు తెల్లం సింహాచలం, మసీదు పెద్దలు ఎస్‌కే బాజీ, షేక్ మస్తాన్, షేక్ హిమామ్, షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ వేడుకలు ప్రారంభం



కొయ్యలగూడెం జామియా మసీదులో శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు

కొయ్యలగూడెం: రంజాన్ వేడుకలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం రాత్రి సౌదీలో నెలవంక కనిపించడంతో రంజాన్ వేడుకలను ప్రారంభిస్తున్నట్లు మత పెద్దలు పేర్కొన్నారు. స్థానిక జామియా మసీదులో అల్లాహ్ అక్బర్ అంటూ ముస్లింలు దువా ఆచరించారు. చిన్నారులు ఈద్ ముబారక్ అంటూ పరస్పరం ఆలింగనాలు చేసుకుని అభినందించుకున్నారు. కన్నాపురం, యర్రంపేట, రాజవరం, బయ్యన్నగూడెం, వేదాంతపురం, దిప్ప కాయలపాడు గ్రామాల్లోని మసీదుల వద్ద ముస్లింలు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. శనివారం అన్ని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు, ఈద్గాల వద్ద నమాజులు నిర్వహించనున్నారు.

మున్సిపల్ వర్కర్ల సమస్యలపై వినతి

జంగారెడ్డిగూడెం: మున్సిపల్ వర్కర్స్ సమస్యలను పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య కోరారు. శుక్రవారం ఏఐటీయూసీ, సీఐటీయూల ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కమిషనర్ పి.భవానీ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్మికులకు యూనిఫాం, చెప్పులు, కొబ్బరినూనె, గ్లౌజులు, మాస్కులు, శానిటైజర్‌లు అందజేయాలని, ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలతోపాటు హెల్త్ అలవెన్సు ఇప్పించాలని, జనాభా ప్రకారం కార్మికులను నియమించాలని, రిటైర్డ్ అయినా లేదా మరణించిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని పేర్కొన్నారు. వీటిపై కమిషనర్ సానుకూలంగా స్పందించారని కృష్ణచైతన్య తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జేవీ రమణరాజు, పి.సూర్యారావు, కొత్తూరి నాగేశ్వరరావు, కునపాముల విఘ్నేష్, బి.బాలరాజు, గొన్నూరి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం వైఖరితో రాష్ట్రానికి అన్యాయం



ప్రచార భేరి యాత్రను ప్రారంభించిన నాయకులు

టి.నరసాపురం: కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఆంధ్ర రాష్ట్రానికి అన్యాయం చేసిందని సీపీఐ, సీపీఎం మండల కార్యదర్శులు సాకా గంగరాజు, తుమ్మల సత్యనారాయణ ఆరోపించారు. టి.నరసాపురం మండలం అల్లూరి సీతారామరాజు నగర్‌లో శుక్రవారం వారు ప్రచార భేరి యాత్రను ప్రారంభించారు. దేశాన్ని కాపాడాలనే నినాదంతో చింతలపూడి, లింగపాలెం మండలాల్లోనూ యాత్ర నిర్వహిస్తామన్నారు.

పోలవరం ఏటిగట్టు సెంటర్‌లో..

పోలవరం రూరల్: కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, కార్పొరేట్ కంపెనీలకు దేశ సంపదను కట్టబెడుతున్నారని సీపీఎం మండల కార్యదర్శి గుడెల్లి వెంకట్రావు ఆరోపించారు. శుక్రవారం ప్రచార భేరిలో భాగంగా స్థానిక ఏటిగట్టు సెంటర్‌లో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తోందన్నారు. రాష్ట్రానికి ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని పేర్కొన్నారు.

స్పందన ఫిర్యాదుల పరిష్కారంపై సమీక్ష



మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి సత్యనారాయణ

టి నరసాపురం: గత మూడు నెలల్లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంపై శాఖలవారిగా సమీక్షించినట్టు మండల ప్రత్యేక అధికారి జీవీ సత్యనారాయణ తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విద్యాశాఖ, ఐసీడీఎస్‌లలో నాడు నేడు పనులు, ప్రభుత్వం కార్యాలయాల నిర్మాణ ప్రగతి, వ్యవసాయ, గృహ నిర్మాణ శాఖల పనితీరు, ప్రజల ఆరోగ్యంపై చేపడుతున్న చర్యలపై సమీక్షించారు. వేసవి దృష్ట్యా మంచినీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని, స్పందన ఫిర్యాదులను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జేవీ సుబ్బారావు, మండలం అభివృద్ధి అధికారి ఎన్‌టీ స్వామి, ఎంఈఓ టి.రామ్మూర్తి, ఏఓ డి.ముత్యాలరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె.గంగరాజు, పీఆర్ ఏఈ సంపత్ కుమారి, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

పోలవరం రూరల్: పోలవరం మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులపై మండల ప్రత్యేక అధికారి నాగేశ్వరరావు శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమీక్షించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పనులు వేగవంతంగా పూర్తిచేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ బి.సుమతి, ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాసబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామకృష్ణ, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

నిర్మాణం పనులు త్వరితగతిన పూర్తిచేయాలి

బుట్టాయగూడెం: మండలంలో చేపట్టిన భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ డీఈ, ఇన్‌చార్జి మండల ప్రత్యేక అధికారి ఎస్.జొనాతన్, తహసీల్దార్ ఎస్.శారాశాంతిలు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారుల సమావేశం శుక్రవారం ఎంపీడీఓ ఎం. శ్రీహరి అధ్యక్షతన నిర్వహించారు. జొనాతన్, శారాశాంతిలు మాట్లాడుతూ గృహ నిర్మాణ, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో చేపట్టిన పనులు కూడా వేగవంతం చేయాలన్నారు. నాడు-నేడు పనుల్లో నాణ్యతాలోపాలు లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మురళీకృష్ణ, ఎంఈఓ టి.బాబూరావు, హౌసింగ్ ఏఈ మణికంఠ, మండలంలోని సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

45 కాంటూర్ గ్రామాలకు ఆర్‌ఆర్ ప్యాకేజీ



తహసీల్దార్ చల్లన్నదొరకు వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వేలేరుపాడు: ప్రభుత్వం ప్రకటించిన 45.15 కాంటూర్ లెవల్లో ఉన్న గ్రామాల్లో మొదటి ప్రాధాన్యతగా అర్హులైన నిర్వాసితులందరికీ పోలవరం ఆర్‌అండ్‌ఆర్ వ్యక్తిగత ప్యాకేజీ అందనున్నట్టు వేలేరుపాడు తహసీల్దార్ కె.చల్లన్నదొర తెలిపారు. శుక్రవారం వేలేరుపాడు మండలం ఎడవల్లి, ఎర్రమెట్ట గ్రామాల్లో సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా చల్లన్నదొర మాట్లాడుతూ ఆర్‌ఆర్ ప్యాకేజీకి మంజూరుకాని అర్హులంతా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎడవల్లిలో 72 మంది, ఎర్రమెట్టలో 69 మంది ఆర్‌అండ్‌ఆర్ పీడీఎఫ్‌ల పేర్లను వెల్లడించారు. ఈ రెండు గ్రామాల వారికోసం జీలుగుమిల్లి, బుట్టాయిగూడెం మండలాల్లో నిర్మించిన పునరావాస కాలనీల వివరాలు వివరించారు. చిట్టంరెడ్డిపాలెం గ్రామాన్ని మొదటి ప్రాధాన్యతగా తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నేతలు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. సభల్లో ఎంపీపీ కెచ్చెల లక్ష్మీదేవి, జెడ్పీటీసీ గుజ్జా రామలక్ష్మి, సర్పంచ్‌లు కట్టి ఉదయ్‌కిరణ్, లక్ష్మణ్, పార్టీ మండల కన్వీనర్ కేసగాని శ్రీనివాస గౌడ్, మండల వ్యవసాయశాఖ చైర్మన్ కామినేని వెంకటేశ్వరావు, సచివాలయ కన్వీనర్ కొలూరి సత్తిరాజు, వీఆర్వో సోడే వెంకటేష్, వీఆర్ఏ గణపతి, ఆనంద్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

నవ ధాన్యాలు పండించండి

చింతలపూడి: ప్రతి రైతూ నవ ధాన్యాలను పండించాలని ప్రకృతి వ్యవసాయ నిపుణులు సూచించారు. చింతలపూడి మండలం రాఘవాపురం, పోతునూరు గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. నవ ధాన్యాలు పండించడం వల్ల పంటలకు కావాల్సిన పోషకాలు లభిస్తాయన్నారు. రసాయన ఎరువుల వాడకం వల్ల అధిక ఖర్చుతో పాటు భూమిలో సారం తగ్గిపోతుందని హెచ్చరించారు. ప్రకృతి వ్యవసాయంతో రైతులకు తక్కువ ఖర్చుతో పాటు అధిక దిగుబడి వస్తుందని చెప్పారు. పోతునూరు సర్పంచ్ కందుల లక్ష్మీప్రసన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు గిరి భోగారావు, సీహెచ్ కిషోర్, కె.గోవర్ధనరెడ్డి, డి.కాంతమ్మ, పింగిలి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అంతఃకలహాల్లో టీడీపీ, జనసేనలు

కొయ్యలగూడెం: టీడీపీ, జనసేన పార్టీలు అంతఃకలహాలతో అట్టుడుకుతున్నాయి. పోలవరం నియోజకవర్గంలో ముఖ్యకేంద్రంగా ఉన్న కొయ్యలగూడెం మండలం ఇరుపార్టీల్లోని వర్గ రాజకీయాలకు కేంద్రంగా నిలిచింది. ఇప్పటికే టీడీపీలో మాజీ ఎమ్మెల్యే మొడియం శ్రీనివాసరావు, ప్రస్తుత పోలవరం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొరగం శ్రీనివాస్ వర్గీయులు రెండు గ్రూపులుగా విడిపోయి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ బాహటంగా ఘర్షణలకు దిగుతున్నారు. ఇటీవల మొడియం శ్రీనివాస్ వర్గీయులను సస్పెండ్ చేయడం ఆ వర్గంలో ఆగ్రహ జ్వాలలను రగిలిచింది. మొడియం సైతం దీనిని ప్రతిష్టాత్మకంగా తీసుకొని అధిష్టానం ముందు తాడోపేడో తేల్చుకోవాలని నిర్ణయించుకున్నట్లు ప్రచారం. మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు జన్మదినోత్సవాన్ని సైతం పార్టీలోని రెండు వర్గాలు విడివిడిగా నిర్వహించారు. తాజాగా జనసేన పార్టీలోనూ లుకలుకలు బయటపడ్డాయి. జనసేన ఇచ్చిన పిలుపుమేరకు జనంలోకి జనసేన కార్యక్రమం శుక్రవారం నిర్వహించగా పార్టీలో ఆది నుంచీ ఉంటున్న తమను విస్మరించారంటూ జనసేనలోని ఒక వర్గీయులు కార్యక్రమాన్ని బహిష్కరించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గోవిందరావు వద్దకు పంచాయతీ చేరుకుంది. ఈ వర్గపోరు సర్వత్రా చర్చణీయాంశాలుగా మరాయి.

కళ్ల జోళ్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆర్టీసీ ఏలూరు డిపో సిబ్బందికి ఆశ్రం కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం కళ్ల జోళ్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆశ్రం కళాశాల వైద్యులు డాక్టర్ అమర్‌నాథ్ మాట్లాడుతూ ఆశ్రం వైద్య కళాశాల సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేర్చడంలో ఆర్టీసీ సిబ్బంది ఉష్ణోగ్రతలను, వడగాల్పులను సైతం లెక్క చేయకుండా సేవలందిస్తున్నారని ప్రశంసించారు. వారికి వేసవి తాపం నుంచి ఉపశమనం కలిగించడం కోసం ఆశ్రం కళాశాల ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. ఆర్టీసీ ఏలూరు డిపో మేనేజర్ బి.వాణి, అసిస్టెంట్ మేనేజర్ సి.రాంబాబు, సీజీ ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అన్నసమారాధన

కామవరపుకోట: స్థానిక పాతూరులోని వాలి సుగ్రీవుల గట్టు సమీపంలో ఉన్న గుడ్ల గురమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటుచేస్తున్నట్టు అన్నదాన కమిటీ సభ్యులు ఘంటా భాస్కరరావు, ఆరుమళ్ల ధర్మారావు, ఈదర అంజీ తెలిపారు.